క్లుప్తంగా

శ్రీనివాసుడికి ప్రత్యేక పూజలు




శ్రీనివాసునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండల పరిధి దుప్పాడ గంగనగర్‌లోని శ్రీ క్షేత్రంలో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీనివాసునికి బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యుల వేదమంత్రాల నడుమ స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ మన్నే, భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తయారీపై శిక్షణ

పూసపాటిరేగ : మండల విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పౌష్టికాహారం తయారీపై బుధవారం శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో రిసోర్స్‌పర్సన్ జి. లక్ష్మి పదార్థాలలో పోషకాలు కోల్పోకుండా ఆహారం ఎలా తయారు చేయాలి.. పదార్థాలను ఎలా శుభ్రం చేయాలో వివరించారు. కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ సిబ్బంది, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

1న రామనారాయణంలో హనుమాన్ జయంతి



60 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

విజయనగరం రూరల్: సారిక సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో వచ్చే నెల 1న హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు లక్ష తమలపాకులు, కనకాంబరాలు, సింధూరంతో సాముహిక సహస్ర నామార్చనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాత్రి 7 గంటలకు 60 అడుగుల అభయాంజనేయ స్వామికి మహా హారతి కార్యక్రమం, లేజర్ షో ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వివాహిత అదృశ్యం

విజయనగరం క్రైమ్: పట్టణ శివారు పూల్‌బాగ్ కాలనీలో నివాసం ఉంటున్న 24 ఏళ్ల వివాహిత అదృశ్యమైంది. ఆమె భర్త టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... పూల్‌బాగ్‌కి చెందిన మహిళ తన రెండేళ్ల కుమార్తెతో కలిసి ఈ నెల 25న బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భర్త ఇంటికి వచ్చి చూసేసరికి భార్య లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. టూటౌన్ సీఐ కోరాడ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పైడితల్లి పండుగ

బాడంగి: మండలంలోని డొంకినవలస పైడితల్లి పండుగ బుధవారం నాటి అంపకోత్సవంతో ప్రశాంతంగా ముగిసింది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు పండుగ నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవారు పూనును మేళతాళాలతో ఊరేగించగా.. భక్తులు పసుపు, కుంకుమలతో గ్రామ శివారులోగల అమ్మవారి గుడికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఆర్.జయంతి బందోబస్తు నిర్వహించారు.

మండలానికి చేరుకున్న కట్టెజనుము విత్తనాలు

రేగిడి : భూసారం పెంపొందించేందుకు అవసరమైన కట్టెజనుము విత్తనాలు ఆర్‌బీకేలకు చేరుకున్నాయని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని చాటాయివలస, ఉంగరాడ, గుళ్లపాడు ఆర్‌బీకేలకు వెయ్యి కిలోల చొప్పున విత్తనాలు అందించామన్నారు. వీటిని ఆయా కేంద్రాల్లో భద్రపరిచామని, రైతులకు త్వరలో అందిస్తామని తెలిపారు.

వివాహానికీ రిజిస్ట్రేషన్..

- సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్లు
- ఏటా జిల్లా కేంద్రంలో వందలాదిగా జరుగుతున్న వివాహాలు
- అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలో అవగాహన లేమి
- అవసరమైనప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



విజయనగరం: నగరానికి చెందిన సత్యనారాయణ మూర్తికి 50 ఏళ్లు. ఉద్యోగరీత్యా కొడుకు విదేశాల్లో స్థిర పడ్డాడు. కొడుకును చూసేందుకు రమణమూర్తి ఆయన భార్య విదేశాలకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోగా... మీరిరువురూ భార్యాభర్తలేనంటూ అధికారిక ధ్రువీకరణ పత్రం సమర్పించాలని అధికారులు సూచించారు. దీంతో చేసేదేమీ లేక 50 ఏళ్ల వయస్సులో రమణమూర్తి ఆయన భార్య సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ధ్రువీకరణపత్రానికి దరఖాస్తు చేసుకుని, సంతకాలు చేయాల్సి వచ్చింది.

బహుళ ప్రయోజనాలు..

వివాహం చేసుకునే దంపతులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదు చేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా విదేశాలకు వెళ్లేవారికి ఇది చాలా అవసరం. అయితే ఈ విషయం తెలియని నూతన వధూవరులు ఆ దిశగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. దీంతో అత్యవసర సమయంలో అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి వివాహం చేసుకున్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన ఆవశ్యకత రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుత ప్రపంచంలో మనిషికి జనన, మరణ ధ్రువీ కరణతో పాటు వైవాహిక ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మారుతోంది. వైవాహిక జీవితంలోకి అడుగిడే యువత పెళ్లి తంతును బంధుమిత్రుల సమక్షంలో సంబరంగా జరుపుకుంటున్నారు. ఆ జ్ఞాపకాలను ఫొటోలు, వీడియోల రూపంలో భద్రపరుచుకుంటున్నారు. ఇదే సందర్భంలో ప్రాధాన్యమున్న వివాహ ధ్రువీకరణ పత్రాలు పొందే విషయంలో చాలా మంది నిర్లిప్తంగా ఉంటున్నారు. పెళ్లి జరిగిన తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, సచివాలయాల్లో నమోదు చేయించుకుంటే భవిష్యత్‌లో అనేక ప్రయోజనాలు ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే విజయనగరం కార్పొరేషన్ పరిధిలో వివాహల నమోదు ఆశించిన విధంగా సాగడం లేదు.

సుమారు 200 పెళ్లిళ్లు..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్‌లు ఉండగా.. 3 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. ప్రతి ఏడాదీ సుమారు 150 నుంచి 200 వరకు పెళ్లిళ్లు అవుతున్నాయి. అయితే ఇందులో కేవలం పదుల సంఖ్యలో మాత్రం నమోదు చేసుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. గతంలో పెళ్లి చేసుకున్న దంపతులు రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే వివరాలు నమోదు చేయించుకోవాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రస్తుతం సచివాలయాల్లోనూ ఈ అవకాశం కల్పించింది. పెళ్లి చేసుకున్న నవ దంపతులు మూడు నెలల్లోపు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. నెల లోపు అయితే ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. నెల దాటితే రూ.100 చలానా కట్టాలి. మూడు నెలలు దాటితే సమీప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఏడాదీ వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగు తున్నా విదేశాలకు వెళ్లేవారు, లీగల్ అవసరాలున్న వారు మాత్రమే నమోదు చేయించుకుంటున్నారు. ప్రతి జంట వివాహ బంధాన్ని చట్టపరంగా నమోదు చేయించుకోవాలి. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చిందని, స్లాట్ బుక్ చేసుకుంటే నిర్ణీత తేదీ, సమయంలో వచ్చి వివాహ ధ్రువపత్రాలు పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

విదేశాలకు వెళ్లే దంపతులకు పాస్‌పోర్టు, వీసా, వర్క్ పర్మిట్, బీమా, తదితర విషయాల్లో పెళ్లి ధ్రువపత్రం ఉపయోగపడుతుంది. ఈ పత్రం ఉంటే ఉద్యోగులు భార్య లేదా భర్తను నామినీగా నమోదు చేయించుకోవడానికి వీలవుతుంది. భవిష్యత్‌లో భార్యాభర్తల మధ్య ఇబ్బందులు ఎదురైతే కేసులు, కోర్టులో సాక్ష్యాల విషయంలో పెళ్లి ధ్రువీకరణ పత్రం ఉపయోగపడుతుంది. వివరాలతో నింపిన దరఖాస్తుతో పాటు దంపతులిద్దరి ఆధార్ నకళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, శుభలేఖ, తాళి కడుతున్న చిత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

వివాహ నమోదు అవసరమే ..

నూతన వధూవరులు తప్పనిసరిగా పెళ్లి వివరాలను నమోదు చేయించుకోవాలి. ఆపై ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తారు. ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బందికి తెలియజేశాం.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

పైడితల్లి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

డెంకాడ: మండలంలోని జొన్నాడలో వేంచేసిన పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. గత నెల 24 నుంచి ఈ నెల 29 వరకు హుండీ ద్వారా 64,682 రూపాయల నగదు, 10 గ్రాముల 800 మిల్లీగ్రాముల బంగారం, 347 గ్రాముల 800 మిల్లీగ్రాముల వెండి వచ్చిందని ధర్మకర్త జి. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, సేవకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు డి. శంకరరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు సత్యవాణి

రామభద్రపురం: గ్రంథాలయాలలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ప్రత్యేకంగా పిల్లల కోసం విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవుల్లో ఆటపాటలతో గడిపే చిన్నారులకు ఆయా నిర్వాహకులు చదువుతో పాటు వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక గ్రంథాలయ శాఖాధికారి సత్యవాణి చిన్నారులకు తెలుగు పద్యాలు, చందమామ కథలు, శతక పద్యాలు, ఆట పాటలు నేర్పించడంతో పాటు ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్ట్ టీచర్లను రప్పించి గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్ తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా నేర్పిస్తున్నారు.

ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ

- టెక్కలి నుంచి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రారంభం
- మొత్తం 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- 14 కౌంటర్లు ఏర్పాటు
- ఎదురు చూస్తున్న నియోజకవర్గ ప్రజలు



ఈవీఎం



కొండవెలగాడలో ఓట్లు వేసేందుకు క్యూలైన్‌లో బారులు తీరిన మహిళలు (ఫైల్)

నెల్లిమర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలందరూ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. వచ్చే నెల నాలుగో తేదీ ఎప్పుడు వస్తుందా అని రోజులు లెక్కబెడుతున్నారు. ఈ నెల 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో నియోజకవర్గంలో 84.83 శాతం మంది ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,13,551 మంది ఓటర్లు ఉండగా.. 1,88,456 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటు వేసిన వారిలో పురుషులు కంటే మహిళలే అధికంగా ఉన్నారు. పురుషులు 92,820 మంది ఓటు వేయగా, స్త్రీలు 95,635 మంది, ఇతరులు ఒకరు చొప్పున ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ గణంకాల ప్రకారం ఈ సారి పురుషులు కంటే మహిళలు 2,815 మంది అదనంగా ఓటు వేశారు. దీంతో వారి ఓట్లు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటముల్లో కీలకపాత్ర పోషిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళాభ్యున్నతి సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన మంచే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపిస్తాయని ఆ పార్టీ నేతలు బలంగా నమ్ముతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఉత్కంఠకు తెర పడాలంటే మరో వారం రోజులు వేచి ఉండక తప్పదు.

18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

జూన్ 4వ తేదీన నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్‌కు లెండి కళాశాలలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు వేర్వేరుగా కౌంటింగ్ నిర్వహించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫలితాల అనంతరం ఈవీఎంలను తెరిచి కౌంటింగ్ ప్రారంభిస్తారు. అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో రౌండ్ కౌంటింగ్‌కు 14 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలను తెరిచి ఫలితాలను వెల్లడించనున్నారు. నియోజకవర్గంలోని మొత్తం 248 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఎన్నికల తుది ఫలితం రావాలంటే 18 రౌండ్లు కౌంటింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

టెక్కలిలో ఒకటో నంబర్ పోలింగ్ కేంద్రం

నెల్లిమర్ల మండలం టెక్కలి ఒకటో నంబర్ పోలింగ్ కేంద్రం నుంచి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మండలంలో 70 పోలింగ్ కేంద్రాలున్నాయి. అనంతరం పూసపాటిరేగ మండలంలో కుమిలి గ్రామం నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది. తర్వాత డెంకాండ మండలం పెద తాడివాడ నుంచి... అనంతరం భోగాపురం మండలంలో ఉన్న పోలింగ్ బూత్‌లలో ఓట్లను లెక్కిస్తారు. నెల్లిమర్ల మండలంలోని టెక్కలిలో కౌంటింగ్ ప్రారంభమై భోగాపురం మండలంలోని నందిగాంతో లెక్కింపు ప్రక్రియను పూర్తి చేసి తుది ఫలితాన్ని ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు.

మల్లికార్జునకాలనీలో కార్డన్ సెర్చ్

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మల్లికార్జునకాలనీలో పోలీసులు బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టౌన్ సీఐ డి.మోహనరావు ఆధ్వర్యంలో రాజాం, రేగిడి పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. కాలనీలోని అన్ని వీధుల్లో కలియతిరిగి వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీలో ఎటువంటి పత్రాల్లేని 43 వాహనాలు సీజ్ చేశామని సీఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అనుమానితులు కనబడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రేగిడి ఎస్సై ఇ.శ్రీనివాస్, ఏఎస్సైలు ఎ.లక్ష్మునాయుడు, ఎస్.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



షిర్డీ సాయికి పూజలు చేస్తున్న తలే రాజేష్, జగన్ మోహనరావు, తదితరులు

సంతకవిటి: మండలంలోని మందరాడ షిర్డీసాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పులఖండం శ్రీనివాసరావు శర్మ, పులఖండం శ్రీకాంత్ శర్మ, రేజేటి శ్రీనివాస శర్మ, రేజేటి శ్రీరామ శర్మ, వేమకోటి సతీష్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మారేడుబాక కళాకారులచే ఏర్పాటు చేసిన కోలాట నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహనరావు పూజల్లో పాల్గొన్నారు.

సరదాల మాటున ప్రమాదం..

- వేసవి సెలవుల్లో పిల్లలను ఓ కంట కనిబెట్టాలి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు



క్రికెట్ ఆడుతున్న పిల్లలు



సైకిల్ తొక్కుతున్న విద్యార్థులు

రామభద్రపురం: వేసవి తాపం తీవ్రంగా ఉంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎక్కడ చూసినా వడగాడ్పులు వీస్తున్నాయి. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చిన్నారులు సందడి కనిపిస్తోంది. ఎవరికి ఇష్టం వచ్చిన ఆటలు వారు ఆడుతూ సరదాగా గడిపేస్తున్నారు. అయితే ఈ సరదాల వెనుక ప్రమాదాలు దాగుంటాయని పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉండాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. అలవాట్లు, ఆహారం, ఆరోగ్యం, చదువు తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించుకుంటే వారి మేధస్సుకు పదును పెట్టిన వారమవుతామని సూచిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఖాళీగా ఉండడం ఇష్టం లేక వీలైనంత వరకు తోటి స్నేహితులతో సరదాగా గడపాలని చూస్తారు. ఆటపాటల్లో గడిపేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినప్పటికీ ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి.

బోర్ ఫీలవ్వకుండా...

ఇంట్లో ఖాళీగా ఉంటే పిల్లలు బోర్‌గా ఫీలయ్యే అవకాశం ఉంటుంది. వారికి కొత్త ఆటలు నేర్పించాలి. విజ్ఞానాన్ని పెంచే అంశాలపై దృష్టి సారించేలా చూడాలి. ఉదయం 6 గంటల నుంచి 7.30 వరకు.. సాయంత్రం ఎండ తగ్గిన తర్వాత ఆడుకునేలా చూడాలి. ఇండోర్ ఆటలు ఆడుకునేలా వసతులు కల్పించాలి. ఎండల్లో ఎక్కువగా తిరిగితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది.

వాహనాలతో జాగ్రత్త...

చిన్నతనం నుంచే పిల్లల్లో ఆత్మస్థైర్యం నింపాలి. సముద్రాలు, నదులు, కాలువల్లో కొట్టుకుపోకుండా, తనంతట తానే బయటపడే విధంగా ఈత నేర్పాలి. అలాగే సైకిల్, ద్విచక్రవాహనాలు నేర్చుకోవాలన్న కోరిక పిల్లల్లో సహజంగానే ఉంటుంది. వయస్సు ఆధారంగా సైకిల్ మాత్రమే నేర్పించాలి. కొంత మంది పిల్లలు ఇంట్లో చెప్పకుండా మోటారు సైకిళ్లు తీసుకువెళ్తుంటారు. బైకల తాళాలు వారికి అందుబాటులో ఉంచకూడదు.

ఆటల్లో తర్ఫీదు ఇప్పించాలి..



పిల్లలకు చదువు ఒక్కటే కాదు. ఆటలు కూడా ముఖ్యమే. ఇందుకోసం వేసవి శిక్షణ కేంద్రాలున్నాయి. వాటిని వినియోగించుకోవాలని. అయితే పిల్లలను ఓ కంట కనిబెట్టకపోతే ప్రమాదకరమైన ఆటలాడి ప్రాణాల మీదకు తెచ్చుకునే అవకాశం ఉంది. వీలైనంతవరకు ఇండోర్ గేమ్స్ ఆటుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వాలి.

– బి. రత్నకిషోర్, పీడీ, ఉన్నత పాఠశాల, కొట్టక్కి

ఆరోగ్యంపై ఉష్ణోగ్రతల ప్రభావం..



వేసవిలో సాధ్యమైనంత వరకు పిల్లలు మధ్యాహ్నం పూట ఎండలో తిరగకుండా చూడాలి. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. శీతల పానీయాలు కంటే కొబ్బరిబొండాం, తాజా పండ్ల రసాలు తీసుకోవడం మేలు. వడదెబ్బ తగిలితే ఓఆర్ఎస్ తాగించి దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలి.

– సీహెచ్ మాధురి, ప్రభుత్వ వైద్యాధికారి

వ్యక్తిగత మరుగుదొడ్ల పరిస్థితిపై సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

బాడంగి: మండలంలోని నివాసిత కుటుంబాల వారికి గతంలో రాయితీపై వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామని, అయితే నిర్మాణం చేపట్టి ఐదారేళ్లు గడిచిపోతున్న నేపథ్యంలో వాటి ప్రస్తుత పరిస్థితిపై సర్వే చేపట్టాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో మొత్తంగా 12,500 పైచిలుకు కుటుంబాలుండగా.. సుమారు 7,780 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామన్నారు. అయితే వాటి పరిస్థితిపై సర్వే చేసి తాజా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఇంజినీరింగ్ సహాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారి తిరువీధిలో కలశాలతో మహిళలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి కొండంపేట గ్రామంలో గల అయ్యప్పస్వామి దేవాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఆరవెల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో పాటు పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ, గోపూజ, నవగ్రహ, క్షేత్రపాలక, వాస్తు, యోగిని మండల మంటప ఆవాహనాలు, అర్చనలు, త్రిపూర్వక సూర్యనమస్కారాలు, మహన్యాసపూర్వక మహాలింగార్చనలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఆలయ ధర్మకర్త ముద్దన సత్యారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 4 వేల మందికి అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు వాకముళ్ల చిన్నారావు, యాలాల వెంకటేష్, ఆర్నెపల్లి వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.